రహదారులే కల్లాలు..



మాదాపూర్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి కల్లాలు ఎంతో ముఖ్యం. కల్లాలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద కూడా సరిపడా స్థలం లేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు తన ధాన్యం ఆరబోతకు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ధాన్యం కుప్పలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట):

రైతును 'ముంచిన' వర్షం



మేడిపల్లిలో నేలవాలిన వరి పంట

అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతలను నిండా ముంచుతోంది. వారి ఆశలను అకాల వర్షాలు అడియాసలు చేస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి అంది వచ్చిన వరి పంట నేలకొరిగింది. మండలంలో మేడిపల్లి, మల్లారం, అనంతసాగర్ తదితర గ్రామాల్లో సుమారు 200ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో ఆయా మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట):

క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి



వ్యాక్సిన్ వేస్తున్న మనోహర్

కొముురవెల్లి(సిద్దిపేట): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని స్థానిక పశువైద్యశాల ఉపవైద్యాధికారి మనోహర్ సూచించారు. మండలంలోని గౌరయపల్లిలో పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నవంబర్ 14వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జేఈఓ పాషా, రాజు పాల్గొన్నారు.

గౌసేపాక్ బోధనలు ఆచరణీయం



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

హుస్నాబాద్: పట్టణంలోని జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గౌసేపాక్ గ్యార్మి షరీఫ్ జెండా పండుగ నిర్వహించారు. ముస్లింలు భక్తి శ్రద్ధలతో జెండాను జామా మసీద్ నుంచి ఆలంగీర్ మసీద్ వరకు తీసుకువెళ్లి గౌస్‌పాక్ వద్ద జెండాను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఆడ పిల్లలకు విద్యను అందించాలని, తద్వారా కుటుంబ వ్యవస్థ బాగుంటుందని గౌసేపాక్ చేసిన బోధనలు ఆచరణీయమన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జామా మసీదు కమిటీ అధ్యక్షుడు బాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్, అయూబ్, దస్తగిరి, అఫ్జల్, షబ్బీర్, అక్బర్, సాజీద్, ఫసి, కమాల్‌సాబ్ తదితరులు ఉన్నారు.

చర్యలు తప్పవు: సీఐ మురళి

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పిడిచెడ్ రోడ్డు, క్యాసారం చౌరస్తా, తూప్రాన్ రోడ్డు చౌరస్తా, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఇటీవల తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 31మంది పట్టుపడ్డారన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రియాంక రూ.24,500 జరిమానా విధించారని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 9మంది వాహనదారులు పట్టుబడని, వారిని కోర్టులో హాజరుపర్చగా రూ.18,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యతోనే సామాజిక పురోగతి



మాట్లాడుతున్న నర్సింహచారి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యతోనే ప్రజా చైతన్యం సాధ్యమని, అది సామాజిక పురోగతికి సరైన మార్గమని మానసిక వైద్య నిపుణుడు నర్సింహచారి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక రుగ్మతలు, ఆరోగ్యం గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒత్తిడిని ఏ విధంగా జయించాలో, చదువు విషయంలో ఏకాగ్రతను ఎలా సాధించాలో వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఉన్నారు.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థికాభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



బ్యాగుల తయారీని పరిశీలిస్తున్న నర్సయ్య

గజ్వేల్‌రూరల్: మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. ఇంద్ర మహిళ శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యులు యూనియన్ బ్యాంకు ద్వారా మంజూరైన రుణాలతో ఏర్పాటు చేసుకున్న జూట్ బ్యాగుల తయారీ, స్టీల్ బ్యాంక్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బ్యాగుల తయారీపై పలు సూచనలు చేశారు. మెప్మా సీఓ సరిత, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడటం అందరి బాధ్యత

ఎంపీడీఓ భానోతు జయరాం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): నర్సరీల్లో మొక్కలను చంటి పాపలా కాపాడుకోవాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. మండల పరిధిలోని గౌరవెల్లి గ్రామంలోని నర్సరీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పోస్తుండాలన్నారు. మొక్కలను రక్షించుకొనేందుకు గ్రీన్‌నెట్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, ఏపీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి మాలోతు నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బైరగోని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో స్థల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)లో వచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు మొత్తం 33లాగిన్‌లను ఏర్పాటు చేసి వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం 32,533 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా యని చెప్పారు. సమస్యలు, సందేహాలు ఉంటే అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, నిషేధిత సర్వే నంబర్లతో ఉన్న స్థలాలను క్రమబద్ధీకరణ చేయకూడని తెలిపారు. సమావేశంలో సీపీఓ వందనం, టీపీఓ నశ్రీన్‌ఖాను, టీపీఎస్ స్రవంతి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఇతర నాయకులు, రైతులతో కలిసి శుక్రవారం ఆయన తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు. దళారులు క్వింటాలుకు రూ.5వేలు చెల్లిస్తున్నారని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రవీందర్, ఇస్తారి, బాల కిషన్, భరత్ కుమార్, భిక్షపతి, యాదయ్య, యాదగిరి, ఎల్లయ్య, శ్రవణాచారి, మల్లయ్య పాల్గొన్నారు.

వీడీఏ వెంటనే అమలు చేయాలి

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం వీడీఏను జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. పరిశ్రమల వాడల్లో కనీస వేతనాల జీఓలు సక్రమంగా అమలు చేయడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, గ్రాడ్యుటీ వంటివి అందడం లేదన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

దుబ్బాకటౌన్: దుబ్బాక మండలం హబ్సీపూర్‌లోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దుబ్బాక మున్సిపాలిటీ, దుబ్బాక, మిరుదొడ్డి అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు శనివారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏడీఈ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

కాపర్ వైర్ చోరీ

కొముురవెల్లి(సిద్దిపేట): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరీ చేసిన ఘటన మండలంలోని అయినాపూర్‌గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలుసాని సత్యనారాయణ పొలంలోగల 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి సుమారు 45కిలోల కాపర్‌వైర్, 55లీటర్ల ఆయిల్‌ను దొంగిలించారు. జేఎల్ఎం ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

'లవ్‌రెడ్డి' దర్శకుడి సందడి



సత్కరిస్తున్న అభిమానులు

చేర్యాల(సిద్దిపేట): 'లవ్‌రెడ్డి' సినిమా దర్శకుడు స్మరణ్‌రెడ్డి శుక్రవారం స్థానిక వీరభద్ర కళామందిర్ వద్ద సందడి చేశారు. సినిమా చూడడానికి వచ్చిన ప్రేక్షకులతో మాట్లాడారు. మండల పరిధిలోని గుర్జకుంటకు చెందిన తన దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమా విడుదల రోజున మిత్రులు, అభిమానుల సమక్షంలో చూడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సినిమా చూసి ప్రోత్సహించాలని కోరారు.

19లీటర్ల మద్యం స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్‌షాపుపై దాడి చేసి 19లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామానికి చెందిన లింగాల బాలయ్య ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నాడనే సమాచారం అందింది. దీంతో అతడి బెల్ట్‌షాపుపై దాడి చేయగా 19లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఓ పేకాట స్థావరంపై గురువారం రాత్రి మండలంలోని మర్మాముల శివారులోని ఓ ఫామ్ హౌజ్‌లో పేకాట ఆడుతున్న ఇప్ప నిష్కాంత్‌రెడ్డి, ఉప్పునూరి శ్రీధర్, వంగ రమేష్, గాజుల యాదగిరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, మూడు బైక్‌లు, 5మొబైల్ ఫోన్లు, రూ.16వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నూతన ఉపాధ్యాయులకు అవగాహన



ఉపాధ్యాయులను కలిసిన యూటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇటీవల జిల్లాలో నియామకమైన 256మంది ఉపాధ్యాయులకు ఆదివారం ఉదయం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వీస్ రూల్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులను కలిసి సదస్సును విజయవంతం చేయాలని కోరినట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, ఇస్మాయిల్, కనకరాజు, లతీఫ్, నూతన ఉపాధ్యాయులు నరేశ్, శ్రీకాంత్, అన్వేషిత, ఉమేరా బేగం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు

దుబ్బాక: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో పదో తరగతి విద్యార్థిని చామంతి ఏకపాత్రాభినయంలోను, యశ్వంత్ వాద్య సంగీతంలోను, క్రాంతికుమార్ పెయింటింగ్‌లోను జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. వారు వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీలలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఎంఈఓ ప్రభుదాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను శుక్రవారం గైడ్ టీచర్స్ నాగరాజు, నరేశ్, భవాని, మదన్‌మోహన్, జ్యోతి అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించం

వ్యవసాయాధికారి నరేశ్



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ ఎరువుల దుకాణదారులకు సూచించారు. మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దుకాణదారులు నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అండర్-17 ఖోఖో పోటీల్లో ప్రథమస్థానం, అండర్-14 పోటీల్లో తృతీయస్థానం సాధించారన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలువడంతో ఖోఖో జట్టు క్రీడకారులను హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ కట్టమైసమ్మా.. కరుణించమ్మా..



మర్కూక్(గజ్వేల్): మండలం కేంద్రమైన మర్కూక్ శివారులోని కట్టమైసమ్మ దేవస్థానంలో శుక్రవారం పురోహితులు మాధవశర్మ, కార్తీక్ శర్మ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, హోమం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సూరిబాలనర్సయ్య, బాబురెడ్డి, ఎల్లం, బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

గజ్వేల్‌రూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సీఐ సైదా పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, గుడ్ అండ్ బాడ్‌టచ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ సీఐ మురళితో కలిసి శుక్రవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాములు, శ్యామల, లావణ్య, మహేశ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట మహిళా సీఐ దుర్గ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు.

◆ పలు ఆలయాల్లో హుండీల అపహరణ

కొండపాక(గజ్వేల్): మండలంలోని పలు ఆలయాల్లోని హుండీలను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. అంకిరెడ్డిపల్లిలోని ఎల్లమ్మ, రవీంద్రనగర్‌లోని హనుమాన్, కొండపాకలోని రుద్రేశ్వర ఆలయాలలోని హుండీలను ఎత్తుకెళ్లారు. ఆయా ఆలయాల నిర్వాహకులు త్రీ టౌన్, కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఆలయాలను శుక్రవారం పోలీసులు పరిశీలించి దొంగతనం జరిగిన తీరుపై ఆరా తీశారు.

◆ కష్టపడ్డ వారికే పదవులు ఇవ్వాలి

సిద్దిపేటకమాన్: పార్టీలో కష్టపడ్డ వారికి మాత్రమే నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో వచ్చిన వారికి పదవులు ఇస్తే ఊరుకోబోమన్నారు. సమావేశంలో రాజిరెడ్డి, ఎల్లవ్వ, రజని, చంద్రశేఖర్, సురేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు అధిక వడ్డీలు

కొండపాక(గజ్వేల్): డీసీసీబీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు చేసుకుంటే అధిక వడ్డీలు పొందవచ్చని దుద్దెడ బ్రాంచ్ మేనేజర్ సుధారాణి తెలిపారు. మండలంలోని దుద్దెడలో శుక్రవారం జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18నుంచి 50యేళ్ల గలవారు సంవత్సరానికి రూ.436 చెల్లించి బీమా చేయించుకుంటే రూ.2 లక్షల జీవిత బీమాకు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హీనా అఫ్రీన్, బ్రాంచ్ మేనేజర్ ఎల్లయ్య, ఐకేసీ ఏపీఎం మగ్దుమ్ అలీ, శ్రీనివాస్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ హమాలీలకు వెల్ఫేర్ బోర్డు అవసరం

బెజ్జంకి(సిద్దిపేట): హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాల్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామ కార్యదర్శిగా సంగ ఎల్లయ్యను ఎన్నుకున్నారు. రవికుమార్, శ్రీనివాస్, ఎల్లయ్య, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ కిసాన్ మోర్చా మండల నేతగా శ్రీనివాస్

సిద్దిపేటరూరల్: బీజేపీ కిసాన్ మోర్చా నారాయణరావుపేట మండల అధ్యక్షుడుగా పోతుల శ్రీనివాస్‌ను నియమిస్తూ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిరుపతి శుక్రవారం నియామక పత్రం అందించారు.

◆ ధ్రువపత్రాల జారీలో జాప్యం చేయొద్దు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ధ్రువపత్రాల జారీలో ఆలస్యం చేయవద్దని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి కుంబాల రమేశ్ మాట్లాడారు. రజాక్, సతీశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

◆ వైకుంఠ రథం అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో కంచం భూంలక్ష్మి, బాలయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వైకుంఠ రథాన్ని పంచాయతీకి శనివారం అందజేశారు. వైకుంఠ రథాన్ని భూంపల్లి ఎస్ఐ హరీశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో యాదగిరి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం డిమాండ్

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పోలోజు రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకపోవడంతో వారి విద్య అగమ్యగోచరంగా మారిందన్నారు. భూ శంకరాచారి, రాంప్రసాద్, అనంతస్వామి, అభినయ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

◆ సీఎం సహాయ నిధి పేదలకు వరం



మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయ నిధి పేదలకు వరంలా మారిందని మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగాపూర్‌కు చెందిన దాడి రవికి మంజూరైన రూ.15,500 చెక్కును శుక్రవారం వారు అందజేశారు. మాజీ సర్పంచ్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు గోలి నరేందర్, ధనలక్ష్మి కృష్ణ, బాల్‌రాజు, కరుణాకర్, భీంసింగ్, నరేశ్ పాల్గొన్నారు.